ప్రియమైన జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా న్యాయమూర్తులకు, అధికారులకు, అనధికారులకు, పాత్రికేయులకు, కార్మిక, కర్షక, విద్యార్థినీ విద్యార్థులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ఉద్యమకారులకు, ఉద్యమంలో అసువులు బాసిన తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు 75వ భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మనం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తరువాత 8వ సారి ఈ వేడుకలను జరుపుకుంటున్నందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను.

ప్రపంచ చరిత్రలో మన ఆగష్టు, 15కు విశిష్ట స్థానం ఉంది. రెండువందల సంవత్సరాల పాటు విదేశీయుల నిరంకుశపాలనలో ఉన్న మన జాతి స్వేచ్ఛావాయువులను పీల్చిన రోజు ఈ రోజు.

1857 నాటి సిపాయిల తిరుగుబాటుతో ప్రారంభమైన స్వాతంత్ర్య సంగ్రామానికి కొనసాగింపుగా జాతిపిత మహాత్మా గాంధి, పండిట్ నెహ్రూ, పటేల్, నేతాజీ, బాబా సాహెబ్ అంబేడ్కర్ వంటి ఎందరో మహానుభావులు స్వాతంత్రోద్యమానికి పునాదులు వేసినారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని మీకు వివరించడానికి సంతోషిస్తున్నాను.

## దళితబంధు:

దేశంలో అత్యంత అణగారిన, పేదరికంలో మగ్గిపోతున్న, అంటరానితనంతో వివక్షకు గురవుతున్న షెడ్యూల్డు కులాల అభ్యున్నతికి, ఆర్థిక సాధికారత కల్పించుటకు రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు దేశంలో మరెక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో “ **దళితబంధు** ” పథకంను ప్రవేశపెట్టినారు.

ఈ పథకం అర్హులైన అన్ని SC కుటుంబాలకు దశల వారీగా వర్తింపచేయడం జరుగుతుంది. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం అర్హులైన ప్రతి SC కుటుంబానికి బ్యాంక్ లింకేజీతో నిమిత్తం లేకుండా 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించబడుతుంది.

కుటుంబంలోని వ్యక్తుల ఆసక్తి, అనుభవం మరియు నైపుణ్యాల ఆధారంగా వారికి నచ్చిన ఆర్థిక పథకాన్ని చేపట్టవచ్చు. ప్రభుత్వం కూడా ఆసక్తి కల వారికి శిక్షణ మరియు ఇతర సామర్ధ్య నైపుణ్యాలను మెరుగుపర్చుటకు తగిన ఏర్పాట్లు చేస్తుంది. ఈ పథకం ద్వారా దళిత కుటుంబాలు తక్కువ వ్యవధిలో మంచి ఆదాయాన్ని పొంది ఆర్థిక సాధికారత సాధించటం జరుగుతుంది. ఇట్టి ఆర్థిక సహాయంతో ఏం చేయాలో నిర్ణయించుకోలేని కుటుంబాల వారికి ఉత్తమమైన కార్యాచరణ ఏమిటో మార్గనిర్దేశం చేయటం జరుగుతుంది.

కుటుంబంలో సంపాదిత వ్యక్తి మరణం లేదా తీవ్రమైన ప్రమాదం వంటి అవాంతర కారణాల వలన ఏ లబ్దిదారుని కుటుంబం తిరిగి పేదరికంలోకి జారిపోకుండా ఉండుటకు, లబ్దిదారులు తమ వంతుగా 10 వేల రూపాయలు మరియు ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంటుగా 10 వేల రూపాయలు సమకూర్చి అట్టి మొత్తంతో **"రక్షణ నిధి"** ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ పథకం అమలు ద్వారా SC వర్గాలను సమాజంలో ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ఎంతో దోహదపడుతుంది.

## వ్యవసాయ శాఖ:

జిల్లాలో రైతు బందు పథకం క్రింద ఈ వానాకాలం సీజన్లో 4 లక్షల 52 వేల మంది రైతుల ఖాతాలలో ఎకరానికి 5 వేల చొప్పున 596 కోట్ల రూపాయలు పంట పెట్టుబడిగా పంపిణీ చేయనైనది. **రైతు భీమా పథకం** ద్వారా గత సంవత్సరం చనిపోయిన 1230 మంది రైతులకు సంబంధించిన వారి వారసుల ఖాతాలలో 61 కోట్ల రూపాయలు జీవిత భీమా సంస్థ ద్వారా జమచేయడం జరిగింది.

## పశుసంవర్ధక శాఖ:

గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం ద్వారా ఇప్పటి వరకు 28 వేల మంది లబ్ది పొందినారు. అలాగే ఈ మాసంలో సుమారు 14 లక్షల గొర్రెలకు మరియు మేకలకు నట్టల నివారణ మందులు త్రాగించడం జరిగింది.

**మత్స్య శాఖ:**

IFDS పథకం ద్వారా మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికై చేపల విక్రయ వాహనములు మరియు ఇతర పనిముట్లు 6 వేల మంది లబ్దిదారులకు పంపిణీ చేయుటకు 27 కోట్ల రూపాయలు మంజూరు చేయనైనది. మరియు 100 శాతం రాయితీ పై 17 మహిళా మత్స్యకార సహకార సంఘాలకు 57 లక్షల రూపాయలు సహాయ నిధి అందించనైనది. ఈ సంవత్సరమునకు జిల్లాలోని 1280 చెరువులలో 6 కోట్ల చేప పిల్లలను వదులుటకు ప్రతిపాదించనైనది.

**మిషన్ భగీరథ:**

ప్రతిష్ఠాత్మకమైన మిషన్ భగీరధ పథకం ద్వారా 1718 ఆవాసాలకు సురక్షిత మంచి నీరు నల్లాల ద్వారా ప్రతి ఇంటికి సరఫరా చేయుచున్నాం. దీనివల్ల మన జిల్లాలో ఫ్లోరైడ్ ను అరికట్టగలిగాం మరియు మిగతా ఆవాసాలలో త్వరలో సురక్షిత త్రాగు నీరు అందించుటకు పనులు శరవేగంగా జరుగుచున్నవి.

**విద్యుత్:**

గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ప్రవేశ పెట్టిన వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా పథకము వలన 2 లక్షలకు పైగా రైతులు లబ్ది పొందుతున్నారు.

4 వేల మెగా వాట్లతో దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామములో **యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు** ఏర్పాటు చేస్తున్నాం. పవర్ ప్లాంటు నిర్మాణానికి గాను 11 వేల 353 కోట్ల రూపాయలతో పనులు పురోగతిలో కలవు.

**పరిశ్రమలు- టి.ఎస్.ఐ.పాస్.**

టి.ఎస్.ఐ-పాస్. చట్టం ద్వారా జిల్లాలో ఈ సంవత్సరం 44 పరిశ్రమలు 713 కోట్ల రూపాయలతో స్థాపించుట ద్వారా 3 వేల 500 మందికి ఉపాధి కల్పించుటకు అనుమతించనైనది. టి.ప్రైడ్ పథకం క్రింద ఈ సంవత్సరములో ఇప్పటి వరకు 209 పరిశ్రమలు స్థాపించనైనది. వచ్చిన దరఖాస్తులకు గాను 16 కోట్ల 81 లక్షల రూపాయలు పెట్టుబడి రాయితీగా మంజూరి చేయడం జరిగింది.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS):

ఈ ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల 27 వేల మంది కూలీలకు ఉపాధి కల్పించుటకు గాను 158 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగింది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన " **పల్లె ప్రగతి** " కార్యక్రమం అమలులో భాగంగా జిల్లాలో పంచాయితీరాజ్ శాఖ ద్వారా ఇప్పటి వరకు 72 కోట్ల రూపాయలతో 801 వైకుంఠధామాల నిర్మాణం పూర్తి కాగా మిగిలినవి పురోగతిలో ఉన్నవి, 15 కోట్ల రూపాయల ఖర్చుతో 834 కంపోస్ట్ షెడ్ల నిర్మాణం పూర్తి గావించబడి మిగిలినవి పురోగతిలో ఉన్నవి.

జిల్లాలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున 10 ఎకరాలలో బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 24 లక్షల మొక్కలు నాటడం జరిగింది. జిల్లాలో 1435 గ్రామపంచాయితీలు, ఆవాసాలలో పల్లె ప్రకృతి వనంలు ఏర్పాటు చేయడం జరిగింది. **తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో** భాగంగా ఈ సంవత్సరంలో 9 లక్షల మొక్కలు నాటడం జరిగింది.

## నూతన ఆహార భద్రత కార్డుల పంపిణీ:

పేదలకు ఆహార భద్రత కల్పించుటకు అర్హులైన 11395 మంది లబ్దిదారులకు క్రొత్తగా ఆహార భద్రత కార్డులు పంపిణీ చేయడం జరిగింది.

## కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్:

ఈ ఆర్థిక సంవత్సరంలో **కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకంల** క్రింద SC/ST/BC/EBC & మైనారిటీలకు ఒక్కొక్కరికి ఒక లక్షా 116 రూపాయల చొప్పున ఒక వేయి తొమ్మిది వందల మంది లబ్దిదారులకు 19 కోట్ల రూపాయలు పంపిణీ చేయడం జరిగింది.

## పురపాలక సంఘాలు :

పట్టణ ప్రగతిలో బాగంగా జిల్లాలోని 8 మున్సిపాలిటీలలో పట్టణ ప్రగతి వనాల ఏర్పాటు, సి.సి.రోడ్లు, డ్రైనేజిల నిర్మాణం మరియు Integrated Veg & Non Veg మార్కెట్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నవి.  వీటి ద్వారా గుణాత్మక మార్పులు రాబోతున్నాయి.

## <u>గ్రామ పంచాయితీలు:</u>

ఈ ఆర్థిక సంవత్సరములో జిల్లాలోని 844 **గ్రామ పంచాయితీలకు** 15వ ఆర్థిక సంఘం నిధులు మరియు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల నుండి 51 కోట్ల రూపాయలు విడుదల కాబడినవి. నివాస ప్రాంతాల నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించుటకు మరియు తెలంగాణకు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు నీరు పోయుటకు గాను ప్రతి గ్రామ పంచాయితీకి నూతన ట్రాక్టర్లు, ట్రాలీలు మరియు ట్యాంకర్లు కొనుగోలు చేయడం జరిగింది. దళితవాడలలో ప్రత్యేక మౌళిక సదుపాయాలు కల్పించుట జరుగుతుంది.

## <u>వైద్య మరియు ఆరోగ్య శాఖ:</u>

మన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన “ **కెసిఆర్ కిట్** ” పథకం మంజూరికై ఒక లక్షా 12 వేల గర్భిణీ స్త్రీలు నమోదు చేయడం జరిగింది. 37 వేల మందికి 48 కోట్ల విలువైన కెసిఆర్ కిట్లను పంపిణీ చేయడం జరిగింది.

ప్రపంచాన్ని గడగడలాదిస్తున్న “ **కరోనా వైరస్** ” వ్యాధి నివారణకు నిరంతరం శ్రమిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, పోలీస్, రెవెన్యూ మరియు పారిశుద్ధ్య సిబ్బందిని అభినందిస్తున్నాను. కరోనా వైరస్ పై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. జిల్లాలో ఇప్పటి వరకు 7058 కుటుంబాలను హౌస్ సర్వే చేయడం జరిగింది. 9 వేల మందిని హోమ్ ఐసోలేషన్ చేయడం జరిగింది. ఇప్పటివరకు 3 లక్షల 35 వేల మందికి వ్యాక్సిన్ వేయడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వ సహాయం మేరకు వంద శాతం ప్రజలకు వ్యాక్సినేషన్ చేయుటకు చర్యలు గైకొనుచున్నాము. కరోనా వైరస్ సోకిన రోగులకు జిల్లాలోని వైద్యశాలలలో 210 ఆక్సిజన్ తో కూడిన పడకలు ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందించడం జరుగుచున్నది.

## <u>షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల అభివృద్ధి:</u>

ఈ విద్యా సంవత్సరంలో **SC మరియు STల అభివృద్ధికై** ఉపకార వేతనంల ద్వారా 17 కోట్ల రూపాయలతో 14 వేల మంది విద్యార్ధులకు లబ్ది చేయనైనది. షెడ్యూల్డు కులముల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం క్రింద 4 లక్షల 15 వేల మంది లబ్దిదారులకు 4 కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరు చేయనైనది.

**వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ** ద్వారా 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఉపకార వేతనములు మరియు ఫీజు రీయింబర్స్ మెంటు కొరకు 79 వేల మంది విద్యార్థులకు 43 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది.

## అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ:

గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు దేశంలో మరెక్కడా లేని విధంగా మత సామరస్యాన్ని నెలకొల్పుతూ రంజాన్ పండగ సందర్భంగా జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలలో 11 వేల మంది నిరుపేద ముస్లింలకు మరియు క్రిస్మస్ పండగ సందర్భంగా 7 వేల మంది నిరుపేద క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది.

## శాంతి భద్రతలు:

మన పోలీస్ శాఖ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళటానికి గాను జిల్లాలో జనమైత్రి పోలీసు విధానాన్ని అవలంభిస్తూ అనేక సామాజిక కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం కావటం జరుగుతుంది.

రోడ్డు ప్రమాదాల నివారణకై పోలీస్ శాఖ కీలకంగా పనిచేస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ కళాశాల, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు, వ్యాపారస్తులకు ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు నిబంధనల పట్ల అవగాహన కల్పించుచున్నారు.

నేరాలను అరికట్టడానికి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1500 పైగా సి.సి. కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు అదనంగా మరో 1000 లకు పైగా సి.సి. కెమెరాలను ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తున్నాం.

మహిళల రక్షణలో భాగంగా జిల్లాలో 4 షీ టీంలు ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పిస్తూ భరోసా కేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. ప్రజలతో మమేకం అవుతూ **పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసు** అనే నినాదంతో ఎల్లవేళలా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న పోలీసు యంత్రాంగానికి మరియు కోవిడ్-19 నియంత్రణలో భాగంగా విశిష్టమైన సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు మరియు జిల్లా యంత్రాంగానికి నా తరపున, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మరొకసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను. జిల్లా ప్రజా ప్రతినిధులందరికి, జిల్లా యంత్రాంగానికి మరియు జిల్లా ప్రజానికానికి, పాత్రికేయులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

**- జై హింద్ –**